సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం | 4 | ఆగస్టు | 2024



సొమ్ము స్వాహా
పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఖాతాదారుల సొమ్ము స్వాహా చేశారు.

వివరాలు 8లో ▸



ఏటీఎం చోరీకి యత్నం
గండేడ్‌లోని ఓ ఏటీఎంలో డబ్బుల చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /23.7

వాతావరణం
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

నాగర్‌కర్నూల్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఖమ్మర్ షాజహాన సుల్తానా, ఓపెన్ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు 18వ తేదీలోగా అడ్మిషన్ పొందాలని సూచించారు. మరింత సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్ తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే తరగతులకు విధిగాహాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

జిల్లా పర్యాటకశాఖ అధికారిగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లా పర్యాటక శాఖ అధికారిగా టి.నరసింహను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నరసింహను నియమిస్తూ పర్యాటక శాఖ డైరెక్టర్ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై జిల్లాలో టూరిజం అభివృద్ధి కార్యక్రమాలను ఆయన సమన్వయం చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల నల్లమలలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పర్యటించి.. ఈ ప్రాంతాన్ని దేశ, విదేశీ యాత్రికులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కీలకమైన జిల్లా పర్యాటక శాఖ అధికారిగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని నియమించడం విస్మయం కలిగిస్తోంది.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా షీ టీం పనిచేస్తోందని జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లిలో శనివారం షీ టీం సేవలు, సేఫ్ యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు తెలిసిన వారితోనే ఎక్కువగా వేధింపులకు గురవుతున్నారని అన్నారు. బాధితులు ధైర్యంగా డయల్ 100 లేదా 87126 57676 నంబర్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని.. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల వాహనాల్లో ప్రయాణించేటప్పుడు సేఫ్ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. హెచ్‌ఎం కుర్మయ్య, షీ టీం సభ్యుడు వెంకటయ్య, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

జిల్లాలో పెరుగుతున్న సీజనల్ జ్వర పీడితులు



జిల్లా జనరల్ ఆస్పత్రిలో శనివారం ఓపీ రోగుల రద్దీ ఇలా..

- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల రద్దీ
- జిల్లా జనరల్ ఆస్పత్రిలో నిత్యం 900 పైగా ఓపీ నమోదు
- పట్టణాలు, గ్రామాల్లో లోపించిన పారిశుద్ధ్యం

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో రోజురోజుకూ సీజనల్ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగులు పోటెత్తుతున్నారు. జ్వర పీడితులతో పాటు ఒంటినొప్పులతో ఎక్కువ శాతం జనం క్యూ కడుతున్నారు. జనరల్ ఆస్పత్రిలో సాధారణంగా 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటుండగా.. వారం రోజులుగా ఈ సంఖ్య 900 దాటుతోంది. ఆస్పత్రి ప్రాంగణం, వార్డులు, ఓపీ గదులు రోగులతో కిటకిటలాడుతూ కన్పిస్తున్నాయి.



అచ్చంపేట్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

అధికారుల బదిలీలతో ఇబ్బందులు..

ప్రస్తుతం ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల బదిలీలు కొనసాగుతుండటంతో వైద్య సేవలతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం పడుతోంది. ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగులకు అనుగుణంగా వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. దీంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో జనరల్ ఆస్పత్రితో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉండగా.. వైద్యుల కుర్చీలు మాత్రం ఖాళీగా ఉంటున్నాయి. అధిక శాతం వైద్యులు బదిలీలతో ఇతర ప్రాంతాలకు వెళ్లగా.. ఒకరిద్దరు వైద్యులతో సరిపెడుతున్నారు. మరోవైపు గ్రామాల్లోనూ పారిశుద్ధ్య సమస్యలను పర్యవేక్షించాల్సిన ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలు సైతం కొనసాగుతున్నాయి. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో గ్రామాల్లో వారి సేవలు అందడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యలను పరిష్కరించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రోగుల సంఖ్య పెరిగింది..

జనరల్ ఆస్పత్రికి జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య పెరిగింది. రోజు 900కు పైగా ఓపీ పేషంట్ల సంఖ్య నమోదవుతోంది. డెంగీ అనుమానిత లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహిస్తున్నాం. సీజనల్ వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉన్నాయి. వ్యాధుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలి. – డా.రఘు, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

జిల్లాలోని పట్టణాలతో పాటు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయినేజీల్లో రోజుల తరబడి పూడిక తీయకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతోంది. ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమకాటుతో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం పూర్తికాగా.. ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. అయితే ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఎక్కడా కన్పించడం లేదని చెబుతున్నారు. వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో ఎక్కడా ఆ పరిస్థితి కన్పించడం లేదు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది.

ధరణి అర్జీలు త్వరగా పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

నాగర్‌కర్నూల్: జిల్లాలో ధరణి అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ అన్ని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ.. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వారం రోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారు. ఆర్డీఓలు తమ లాగిన్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. పరిష్కరించిన ప్రతి దరఖాస్తుకు ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని.. తిరస్కరణకు గురైతే ఎందుకు తిరస్కరించారో తెలియజేస్తూ రిమార్కులను నమోదు చేయాలని ఆదేశించారు. సక్సేషన్, పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించాలని ఆర్డీఓలకు సూచించారు. వారం రోజుల్లో దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు తదితరులు ఉన్నారు.

‘స్వచ్ఛదనం– పచ్చదనం’ ఉద్యమంలా చేపట్టాలి..

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛదనం –పచ్చదనం కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో ఉద్యమంలా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మొదటి రోజున స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యువకులు, వార్డు కమిటీ సభ్యులతో ర్యాలీ నిర్వహించడంతో పాటు సమస్యలపై చర్చించాలని సూచించారు. 6న తాగునీటి సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ మెరుగుపర్చాలని, 7న మురుగు కాల్వలు, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రంచేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. 8న సీజనల్ వ్యాధుల నియంత్రణ, వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, డెంగీ, మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు జ్వర సర్వే నిర్వహించడంతో పాటు యాంటీ లార్వా, ఫాగింగ్ చేయించాలని తెలిపారు. 9న డ్రైడే, ప్రభుత్వ సంస్థల శుభ్రత తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కక్షిదారుల రాజీకి చొరవ చూపాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్: జిల్లాలో ఈనెల 14న నిర్వహించనున్న 3వ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా పెండింగ్ కేసుల్లో కక్షిదారుల రాజీకి సంబంధిత అధికారులు, న్యాయవాదులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.రాజేష్‌బాబు అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, మహిళా శిశుసంక్షేమ, వైద్యారోగ్యశాఖ తదితర శాఖల అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ.. జిల్లాలో సివిల్ కేసులు 6,482, క్రైం కేసులు 7,668 కేసులు ఉన్నాయని.. వీటిని చాలా వరకు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా పలు రకాల కేసుల పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. అధికారులు కక్షిదారులకు అవగాహన కల్పించి, కేసుల నుంచి ఉపశమనం కలిగేలా చూడాలన్నారు. మూడవ జాతీయ లోక్‌అదాలత్‌కు కక్షిదారులు విధిగా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్‌జడ్జి సబిత, న్యాయమూర్తులు ఎస్.శ్రీనిధి, మౌనిక, మమతారెడ్డి, అదనపు ఎస్పీ రామేశ్వర్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

పోరాటాలతోనే శ్రామిక రాజ్యస్థాపన సాధ్యం

నాగర్‌కర్నూల్‌రూరల్: బలమైన కార్మికవర్గ పోరాటాలతోనే శ్రామిక రాజ్యస్థాపన సాధ్యమవుతుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసూఫ్, ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో మినీ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పలు అంశాలపై ఉమ్మడి జిల్లాస్థాయి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికవర్గం ఎన్నో త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను ప్రస్తుత మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్మికవర్గ సంక్షేమాన్ని విధ్వంసం చేస్తూ, పెట్టుబడిదారి దోపిడీ వ్యవస్థకు ఆజ్యం పోస్తుందన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ మాట్లాడుతూ.. సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు అనునిత్యం రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి మారేడు శివశంకర్, గద్వాల జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, మాసన్న, మహబూబ్‌నగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సీహెచ్ కొండన్న, సీపీఐ రాష్ట్ర సమితి అధ్యక్షుడు హెచ్ ఆనంద్‌జీ, కేశవులుగౌడ్ తదితరులు ఉన్నారు.

స్నేహం ఓ వరం

- కష్ట సమయాల్లో ఒకరికొకరు అండగా నిలవాలి
- అవసరాలు, స్వార్థం కోసం ఉపయోగించుకోవద్దు
- చెడు వ్యక్తులు, సావాసాలకు దూరంగా ఉండాలి
- ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా ‘సాక్షి’ టాక్‌షో
- ఉత్సాహంగా పాల్గొన్న పాలమూరు రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు

స్వచ్ఛమైన స్నేహానికి ఎల్లలు లేవని.. నిజమైన స్నేహితులకు హద్దులు లేవని యువత పేర్కొన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ‘సాక్షి’ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని రిషి జూనియర్ కళాశాలలో చదువుతున్న మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులతో టాక్ షో నిర్వహించారు. ఇందులో దాదాపు 150 మంది విద్యార్థులు డిబేట్‌లో పాల్గొని వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో స్నేహం తన రూపాన్ని మార్చుకుంటుందని, వ్యక్తుల మధ్య అవసరాలు, స్వార్థం కోసం మాత్రమే స్నేహం కాకుండా.. కష్ట సమయాల్లో సైతం ఒకరికి ఒకరు అండగా నిలిచే విధంగా స్నేహం ఉండాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్





చెడుసావాసాలు వద్దు..



ప్రతిఒక్కరికి స్నేహితులు ఉంటారు. ఎలాంటి ఆస్తులు లేకపోయినా స్నేహితులు ఉంటే తప్పకుండా శక్తివంతులు అవుతారు. మంచి స్నేహితుల వల్ల మంచే జరుగుతుంది. అందుకోసం మంచి వ్యక్తులతో స్నేహం చేయాలి. మరీ ముఖ్యంగా స్నేహానికి.. ప్రేమకు సంబంధం లేదు. స్నేహితుల ముసుగులో చెడుసావాసాలు చేయడం మంచిది కాదు.

– అక్షర, మొదటి సంవత్సరం

విజయతీరాలకు చేర్చేది..



స్నేహమంటే ప్రతి వ్యక్తిలో ఒక మంచి భావన రావాలి. స్వార్థం, ద్వేశం వంటి ఎలాంటి విబేధాలు లేకుండా స్నేహం ఎవరికైనా ఆశ్రయం ఇస్తుంది. మంచి వ్యక్తుల స్నేహం ఏ వ్యక్తినైన గొప్పగా తీర్చిదిద్దుతుంది. స్నేహితులు కష్టసమయాల్లో బాసటగా నిలిచి విజయ తీరాలకు చేర్చడంలో ఎంతో కీలకంగా వ్యవహరిస్తారు. అలాంటి వారికి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.

– చంద్రకళావెంకట్, కరస్పాండెంట్, రిషి కళాశాల

మన కోసం వస్తారు..



సంతోషంగా ఉన్నప్పుడే కాకుండా.. కష్ట సమయాల్లో కూడా ఆదుకునే వారే నిజమైన స్నేహితులు. జీవితంలో ప్రతి ఇబ్బందికర పరిస్థితుల్లో మన అనుకునే వారు మన కోసం రాకపోయినా.. తప్పకుండా స్నేహితులు మన కోసం వస్తారు. అలాంటి వ్యక్తులతో స్నేహం చేస్తే ఫలితం ఉంటుంది.

– దివ్యశ్రీ, మొదటి సంవత్సరం





‘సాక్షి’ టాక్‌షోలో పాల్గొన్న రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు

జీవితాంతం‘స్నేహం’ ఉండాలి

స్నేహానికి హద్దులు లేవని.... అంతరాలు అంతకంటే ఉండవని నిజాయితీతో కుదుకున్న స్నేహం జీవితాంతం అన్ని సమయాల్లో తోడుగా నిలబడుతుందని విద్యార్థులు, యువత చెబుతున్నారు. ‘స్నేహితుల దినోత్సవం’ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో ‘సాక్షి’ ఆధ్వర్యంలో టాక్‌షో నిర్వహించింది. ఈ సందర్భంగా ఫ్రెండ్‌షిప్ ఎలా ఉండాలి.. ఎలాంటి సమయంలో స్నేహితులు అవసరం అనే అంశాలపై ‘సాక్షి’ బృందం సర్వే చేసింది. ఇందులో మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్‌లో 250 మంది విద్యార్థులు పాల్గొని ఆయా అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. జీవితాంతం అన్ని సందర్భాల్లో స్నేహం ఉండాలని, తప్పుచేస్తే మన తప్పును ఎత్తి చూపే స్నేహితుడు ఉండాలని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు.

– ‘సాక్షి’ నెట్‌వర్క్





హద్దులు ఉండవు..



స్నేహితుల్లో మంచి, చెడు అనే హద్దులు ఉండవు. తెలిసీ తెలియక మన మిత్రులు తప్పు చేస్తే వాటిని బాధ్యతగా సరిదిద్దాల్సిన అవసరం ఉంది. మంచి మార్గంలో నడిపిస్తే అదే మన మిత్రులకు మనం చేసే సహాయమవుతుంది. తప్పు ఎదుటి వారు తప్పు చేశారని, మనం అలాంటి తప్పులు చేయకుండా, మిత్రుడు మంచి వారిగా మారేలా చూడాలి.

– అక్షయ, మొదటి సంవత్సరం

తప్పలను క్షమించాలి..



స్నేహితుల్లో కొంతమంది తెలిసీ తెలియక చేసిన తప్పులను క్షమించాలి. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడే సందర్భాలు ఉండకూడదు. అందుకోసం స్నేహాన్ని బలోపేతం చేసుకోవడం వల్ల మంచి స్నేహితులం అవుతాం. అనేక మంది వచ్చిపోయిన బెస్టు ఫ్రెండ్స్ మాత్రం ఎప్పుడూ మనతోనే ఉన్న ఫీలింగ్ ఉంటుంది.

– షణ్ముఖప్రియ, రెండో సంవత్సరం

మంచి అనుభూతి..



స్నేహమనేది ఒక మంచి అనుభూతిని ఇస్తుంది. పాఠశాల సమయంలో నాకు ఉండే స్నేహితులతో అనేక ఎన్నో మధుర స్మృతులు ఉన్నాయి. నేను నా స్నేహితులు ఇప్పటికీ కలుస్తాం. ఏ విషయాన్ని అయిన వారు నాతో పంచుకుంటారు. ఎక్కడికైనా కలిసే వెళ్తాం. ఇబ్బంది ఉంటే సహాయం చేస్తారు.

– లక్ష్మీనారాయణ, ప్రథమ సంవత్సరం

అభ్యసన సామర్థ్యాల పెంపు బాధ్యత టీచర్లదే

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపు బాధ్యత సబ్జెక్టు ఉపాధ్యాయులదేనని డీఈఓ గోవిందరాజులు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నాగర్‌కర్నూల్, తెలకపల్లి, తాడూరు ఉన్నత పాఠశాలల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్‌లో జరిగే జాతీయ సాధన పరీక్ష (న్యాస్)లో 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థుల్లో తెలుగు, ఆంగ్లం, ఫిజికల్ సైన్స్, గణిత సామర్థ్యాలపై మరింత దృష్టి కేంద్రీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ స్థాయిలో పరీక్షించే విద్యార్థుల సామర్థ్యాల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

అనంతరం ఇటీవల జీహెచ్‌ఎంలుగా పదోన్నతి పొందిన రమేష్ ,భాస్కరరావు, సుఖ జీవన్‌రెడ్డిలను సన్మానించారు. కాగా, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు కేవలం ఫిజికల్ సైన్స్ బోధన విధులు నిర్వర్తించేలా చూడాలని ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కృష్ణారెడ్డిలు డీఈఓకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో హెచ్‌ఎం లత ఉన్నారు.

పురుగుల అన్నం.. ఉడకని బియ్యం

- బాలికల హాస్టల్‌లో విద్యార్థుల నిరసన
- వారం రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని హాస్టల్ అధికారులు

వెల్దండ: ఉడకని అన్నంతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని, దీంతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని విద్యార్థులు శనివారం హాస్టల్ ఎదుట నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్‌స్కూల్‌లోని బాలికల హాస్టల్‌లో కొన్ని రోజులుగా ఉడకని అన్నాన్ని హాస్టల్ అధికారులు వడ్డిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు. ఉడకని అన్నం ప్రతి రోజు వడ్డిస్తుండడంతో తీవ్రమైన కడుపు నొప్పితో పాటుగా ఇతర సమస్యలతో వచ్చే నొప్పివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థినిలు చేపట్టిన ఆందోళనతో దిగివచ్చిన హాస్టల్ అధికారులు మధ్యాహ్న భోజన సమయంలో అన్నానికి బదులుగా ఉప్మా వడ్డించారు. ఇన్ని రోజులుగా సమస్యలను పరిష్కరించకుండా ఉన్నారంటే అధికారులకు విద్యార్థులపై ఉన్న శ్రద్ధ కనబడుతుందని వారి తల్లిదండ్రులు ఆరోపించారు.



వెల్దండలో మోడల్‌హైస్కూల్ హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు



హాస్టల్‌లో ఉడకని అన్నం

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

మక్తల్: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మక్తల్ శివారు, గార్లపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్‌కు చెందిన దంతనూర్ కుర్మన్న(45) పట్టణ శివారులో వ్యవసాయ పొలానికి ప్రతిరోజూ వెళ్లివచ్చేవాడు. ఎప్పటి లాగే శుక్రవారం రాత్రి 12 గంటలకు పొలానికి వెళ్లి వస్తుండగా.. పట్టాలు దాటుతున్న సమయంలో.. రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటనపై స్థానికులు మక్తల్ ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య పార్వతమ్మ ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ రూరల్: బిజినేపల్లి మండలంలోని వెలుగొండకి చెందిన మహిళ కేఎల్‌ఐ కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలుగొండకి చెందిన నీలమ్మ(50) ఈ నెల 1న తన భర్త ఎల్లయ్య, కుమారుడు శివ కలిసి వ్యవసాయ పొలంలో పత్తిచేనుకు పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. ఈ సందర్భంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. నీలమ్మ మనస్తాపానికి గురై అదే రోజు కేఎల్‌ఐ నీటిలో దూకింది. ఈత రాకపోవడంతో మృతిచెందింది. ఈ సంఘటనపై మృతురాలి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బిజినేపల్లి పోలీసులు తెలిపారు. మృతురాలి మృతదేహాన్ని నీటిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వివరించారు.

బైక్ ఢీకొని మాజీ సర్పంచ్ మృతి



సాయిరెడ్డి (ఫైల్)

కొత్తకోట రూరల్: మండలంలోని చర్లపల్లి మాజీ సర్పంచ్ సూదిరెడ్డి సాయిరెడ్డి(78), అదే గ్రామానికి చెందిన సూదిరెడ్డి వెంకట్‌రెడ్డి కలిసి పొలాలకు పురుగుల మందు తీసుకొచ్చేందుకు ఎక్సెల్ వాహనంపై కొత్తకోటకు శనివారం ఉదయం బయలుదేరారు. మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని బైక్ వీరి వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో వారిని 108లో కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు సూదిరెడ్డి సాయిరెడ్డి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ తీసుకెళ్తుండగా మధ్యాహ్నం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్‌లో మృతదేహం లభ్యం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్‌ఐ నాగన్న తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించామని.. ఎవరూ గుర్తు పట్టలేదని తెలిపారు. కాగా వ్యక్తికి దాదాపు నలభై సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మూడు, నాలుగు రోజుల క్రితమే నీటి పడి ఉంటాడని.. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందని తెలిపారు. గీతల ఆఫ్ షర్టు, నల్లటీ ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. ఎవరైనా గుర్తిస్తే తన సెల్ నెంబర్ 8712659349 కు ఫోన్ చేసి వివరాలు అందించాలని కోరారు. కాగా వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడా లేక ప్రమాదవశాత్తు నీటిలో పడ్డాడా తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉత్సాహంగా టీసీఏ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో శనివారం టీసీఏ జిల్లా సీనియర్, అండర్-19 క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ రజనీకాంత్‌రెడ్డి ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీల్లో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. టీసీఏ సౌత్‌జోన్ ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీకే.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సీనియర్, అండర్-19 జట్ల ఎంపికల్లో పాల్గొన్న వారికి వారం రోజుల పాటు శిక్షణ అందజేసి మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని తుదిజట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. త్వరలో జరిగే టీసీఏ అంతర్‌జిల్లా రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా జట్లు చాంపియన్‌గా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు అనిల్, నరేష్, గోపీనాథ్, ఫేరోజ్, దినేష్ యాదవ్ పాల్గొన్నారు.



స్నేహం

.. సృష్టిలో సహజంగా ఉద్భవించిన అపురూప బంధం. శాశ్వతంగా నిలిచిపోయే ఆత్మీయ అనుబంధం. ఆనంద భాష్పాలు పంచుకునే టప్పుడే కాదు.. కన్నీట మునిగినప్పుడు దరి చేర్చు ధైర్యమే స్నేహితుడు. నిస్సహాయత, నిరాశ కమ్ముకున్నప్పుడు నేనున్నాననే భరోసా కల్పించి, వెలుగు నింపే వాడే మిత్రుడు. వైఫల్యాలతో కుంగిపోతున్నప్పుడు సాధకుడిలా సాగిపొమ్మంటూ మార్గనిర్దేశం చేసే సిసలైన గురువు. ఊహ తెలిసినప్పటి నుంచి జీవన గమనంలో అడుగడుగునా తోడుగా నిలిచే ఆప్తబంధం స్నేహం. అందుకే రక్త సంబంధం కన్నా గొప్పది స్నేహబంధం అంటారు. స్నేహం అనేది అవసరానికి కాకుండా జీవితాంతం కొనసాగించాలి. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా పలువురి మిత్రుల ఔన్నత్యంపై ప్రత్యేక కథనం.

- సాక్షి నెట్‌వర్క్

వీడిపోనిది స్నేహమొక్కటే..



ఆపత్కాలంలో ఆపన్నహస్తం..

అయిజ: పట్టణానికి చెందిన బైక్ మెకానిక్ వర్క్స్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్ ఆచారి, దేవరాజు, బీచుపల్లి, సత్యం, చాంద్ తదితరులు మంచి స్నేహితులు. వారిలో ఎవరికి ఆపద కలిగినా.. మిగతా వారందరూ కలిసి అండగా నిలుస్తున్నారు. ఇటీవల తమ మిత్రుడు షరీఫ్ మృతిచెందగా.. అతడి కుటుంబానికి రూ. 1.15 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. మరికొందరి కుటుంబాలకు అండగా నిలిచారు. ఆపదలో ఉన్న స్నేహితులను ఏదో రకంగా ఆదుకుంటున్నామని బైక్ మెకానిక్ వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ ఆచారి తెలిపారు.



తమ మిత్రుడు మహేష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఆత్మీయ సమ్మేళనాలతో వెల్లివిరుస్తున్న స్నేహబంధం



స్నేహితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న ఆత్మకూర్ జెడ్పీహెచ్‌ఎస్ 1989-90 బ్యాచ్ మిత్రులు

ఆత్మకూర్: పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలతో స్నేహబంధం వెల్లివిరుస్తోంది. ఒకరి కష్టాలు ఒకరు తెలుసుకొని అండగా నిలుస్తున్నారు. ఆత్మకూర్ బాలుర ఉన్నత పాఠశాలలో 1989-90 బ్యాచ్‌కు చెందిన మండ్ల వేణు అనారోగ్యంతో బాధపడుతుండగా.. అతడి స్నేహితులు ఇటీవల రూ. 63 వేలు ఆర్థికసాయం అందజేశారు. తిప్డంపల్లి పాఠశాల అభివృద్ధికి 1997-98 బ్యాచ్ విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు పలువురు విరాళాలను ప్రకటించారు. తమ స్నేహితుడు మృతి చెందగా.. అతడి కుటుంబానికి రూ. 30 వేలు అందించి ఔదార్యం చాటుకున్నారు.

సామాజిక బాధ్యతలో మమేకమై..



పేద విద్యార్థి చదువు నిమిత్తం ల్యాప్‌టాప్ అందిస్తున్న సోషల్ రెస్పాన్స్‌బిలిటీ సభ్యులు

గద్వాల: తాము సైతం సామాజిక సేవలో మమేకం కావాలన్న దృఢ సంకల్పంతో 'సోషల్ రెస్పాన్స్‌బిలిటీ' పేరిట ఓ సేవా సంస్థను స్థాపించారు విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు. వీరంతా మంచి మిత్రులు. అందరూ ఒక బృందంగా ఏర్పడి ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. తమకొచ్చిన జీతం నుంచి ప్రతినెలా కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుటుంబ పోషణ భారమైన వారితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు, నిరుపేద విద్యార్థుల చదువు నిమిత్తం, ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం.. ఇలా సమాచారం తెలుసుకుని వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 40 కుటుంబాలకు ఆర్థికసాయం అందించి, కొంతమేర వారి ఆర్థిక ఇక్కట్లను తొలగించేందుకు కృషిచేశారు. సామాజిక సేవలను నిరంతరం కొనసాగిస్తామని సభ్యులు తెలిపారు.

మనసున్న స్నేహసేవా కమిటీ..



స్నేహసేవా కమిటీ సభ్యులు

గద్వాల జిల్లా కేంద్రంలోని ఐదు ప్రధాన ఉన్నత పాఠశాలలకు చెందిన 1983-84 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమ స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు 2013లో 'స్నేహసేవా కమిటీ' ఏర్పాటు చేసుకున్నారు. కరోనా కాలంలో కమిటీ తరఫున 20 మంది స్నేహితుల కుటుంబాలకు నిత్యావసరాలు, కొంత ఆర్థికసాయం చేసి ఆదుకున్నారు. తమ బాల్య మిత్రుడు రహీమతుల్లా మృతిచెందగా.. అతడి ఇద్దరి కుమార్తెల వివాహానికి అయ్యే ఖర్చులను భరించారు. మరో మిత్రుడు వెంకటేష్ మృతిచెందగా.. ఆయన కూతురు ఇంజినీరింగ్ చదువుకు అండగా నిలిచారు. చిన్ననాటి మిత్రుడు వహీద్ ఆకస్మికంగా మరణించగా.. అతడి పిల్లల పెళ్లి ఖర్చుల నిమిత్తం రూ.80 వేల ఆర్థికసాయాన్ని అందించారు. మరో స్నేహితుడు శ్రీనివాసులు పేదరికాన్ని గుర్తించి, బీటెక్ చదువుతున్న ఆయన కూతురుకు ల్యాప్‌టాప్ అందించి విద్యాభివృద్ధికి దోహదపడ్డారు. వీరితో పాటు మరికొందరి మిత్రుల పిల్లలకు ఎంబీబీఎస్, టీటీసీ, డిగ్రీ చదువుల కోసం ఫీజులు చెల్లించి తమ స్నేహాన్ని చాటిచెప్పారు.

ఔదార్యం చాటుతున్న ఎస్‌ఎస్‌సీ బ్యాచ్



గురువుల సమక్షంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

శాంతినగర్: శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-2005 పదో తరగతి బ్యాచ్‌లో 106 మంది విద్యార్థులు చదివారు. వీరిలో లక్ష్మీకాంత్‌రెడ్డి, చాకలి రాజశేఖర్ అనే ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న వారి కుటుంబాలకు పూర్వ విద్యార్థులైన స్నేహితులు అండగా నిలిచారు. తమ స్నేహితుల కుమార్తెలు ఇద్దరి పేర్లపై బ్యాంకులో రూ. 25 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అందుకు సంబంధించిన బాండ్లను తమ గురువుల సమక్షంలో అందజేశారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

స్నేహితురాలికి తోడ్పాటు..

పెబ్బేరు రూరల్: పెబ్బేరుకు చెందిన కవిత భర్త ఇటీవల హఠాన్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పెబ్బేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001-02 పదోతరగతి బ్యాచ్ మిత్రబృందం కవిత రూ. 50 వేల ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. తమ స్నేహితులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని చెబుతున్నారు.



కవితకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

ఒకొరికొకరు తోడుగా..



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నర్వ 1999-2000 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు

నర్వ: మండల కేంద్రంలోని 1999 - 2000 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరూ తోడుగా నిలుస్తున్నారు. కొన్ని రోజుల క్రితం పాతర్చేడ్ వద్ద తమ స్నేహితుడు రోడ్డు ప్రమాదానికి గురై మరణించగా.. అతడి కుటుంబానికి రూ. లక్ష ఆర్థికసాయం అందజేశారు. లంకాల్‌కు చెందిన క్లాస్‌మెట్ రమేష్ అనారోగ్యంతో మరణిస్తే రూ.30 వేలు అందించారు. స్నేహితులెవరు ఏ ఆపదలో ఉన్నా.. మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు.

కష్టకాలంలో చేయూత..



స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న 1997-98 బ్యాచ్ మిత్రులు (ఫైల్)

పాన్‌గల్: చిన్నప్పటి నుంచి తమతో కలిసి చదుకున్న స్నేహితుల కుటుంబాలు కష్టాల్లో ఉంటే చేయూత అందిస్తున్నారు పూర్వవిద్యార్థులు. పాన్‌గల్‌కు చెందిన 1997-98 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థిని సునీత భర్త మృతిచెందగా.. ఆమె మిత్ర బృందం రూ. 59 వేలు అందజేశారు. శాగాపూర్‌కు చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందగా.. రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. కేతేపల్లి గ్రామానికి చెందిన ఈశ్వర్, బ్రహ్మానందారెడ్డిలు గుండెపోటుతో మృతిచెందడంతో 1994-95 బ్యాచ్ విద్యార్థులు రూ. 58 వేల చొప్పున అందించి అండగా నిలిచారు. 2002-2003 బ్యాచ్‌కు చెందిన ఖాసిం మృతిచెందగా.. అతడి మిత్రులు రూ. 61,500 నగదు అందజేశారు.

మిత్రుల ప్రోత్సాహంతో ఎస్‌ఐ అయ్యాను..



1999-2000 బ్యాచ్ మిత్రులతో ఎస్‌ఐ నరేందర్

అడ్డాకుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్తిచేశా. మొత్తం 66 మంది విద్యార్థులం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డాం. ఏడాదికి ఒక్కసారైన అందరం కలుసుకుంటాం. మిత్రుల ప్రోత్సాహంతోనే నేను ఎస్‌ఐ అయ్యాను.

- నరేందర్, ఎస్‌ఐ, ఆత్మకూర్.

ఏటీఎం చోరీకి విఫలయత్నం



ఏటీఎం గదిని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్

గండేడ్: ఏటీఎంలో డబ్బుల చోరీకి యత్నించిన దొంగలు పోలీసుల రాకను పసిగట్టి పరారయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉంది. దీని పక్కనే వేరే ఏటీఎం ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో ఏమైనా అత్యవసరంగా డబ్బులు అవసరమైతే తీసుకోవడానికి ఎప్పుడూ తెరిచే ఉంచుతారు. శనివారం తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో దొంగలు రెండు వైపులా ఉన్న సీసీ కెమెరాల వైర్లు కత్తిరించారు. లోపలికి ప్రవేశించి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం ఓవైపు కట్ చేశారు. ఇంతలోనే ఏటీఎంలో ఏదో జరుగుతున్నట్లు బ్యాంకు మేనేజర్ శరత్‌చంద్రకు మెసేజ్ పోయింది. ఆయన వెంటనే స్పందించి ఇంటి ఓనర్ అయిన మహిపాల్‌గౌడ్‌కు 3:13 గంటలకు ఫోన్ చేశారు. ఏటీఎంలో ఏదో జరుగుతున్నట్లుంది ఒక్కసారి చూడాల్సిందిగా కోరాడు. అయితే ఆయన భయంతో బయటికి రాకుండా ఇంట్లో ఉన్న ఫ్యాను ఆఫ్‌చేసి సౌండ్‌ను గమనించాడు. పెద్ద శబ్దం రావడంతో మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డికి ఫోన్‌చేసి సమాచారం అందించాడు. సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ షటర్ మూసి ఉండడాన్ని గమనించి, ఓనర్ మహిపాల్‌ను పిలిపించారు. అందరూ కలిసి షటర్ తెరిచి చూడగా ఎవరూ లేరు. పోలీసులు సకాలంలో స్పందించి ఘటనా స్థలానికి చేరుకోవడంతో వారు పారిపోయారు. దొంగలు ముఖాలకు టవాళ్లు కట్టుకుని ముగ్గురు లోపలికి ప్రవేశించినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయ్యింది. క్లూస్ టీం చేరుకొని ఆధారాలు సేకరించింది. డీఎస్పీ శనివారం ఉదయం వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏటీఎంలో ఉంచిన రూ.13.29లక్షలు భద్రంగా ఉన్నట్లు బ్రాంచ్ మేనేజర్ శరత్‌చంద్ర తెలిపారు.

ఖాతాదారుల సొమ్ము స్వాహా

- పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్ బిజినెస్ కో ఆర్డినేటర్ అసలు సూత్రధారి



పెద్దకార్పాములలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్

పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఖాతాదారుల సొమ్ము దాదాపు రూ.20 లక్షల వరకు స్వాహా అయినట్లు బాధితుల ద్వారా శనివారం రాత్రి తెలిసింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో బీసీపీ దేవేందర్‌ను చిన్నకార్పాముల, రాయవరం గ్రామాల్లో ఖాతాదారులకు డబ్బులు ఇచ్చి జమ చేసుకునేందుకు బ్యాంకు వారు నియమించుకున్నారు. ఆ బీసీపీ దేవేందర్ ఆయా గ్రామాలకు వెళ్లకుండా పంజాబ్ నేషనల్ బ్యాంకులోనే ఉంటూ.. రైతులకు రుణాలు, బంగారు తాకట్టు పెట్టుకునే విభాగాలను చూసుకుంటున్నాడు. అంబటిపల్లికి చెందిన దేశేటి సతీష్ 3 తులాల 8 గ్రాముల బంగారును జూలై 19న బ్యాంకులో తాకట్టుపెట్టి రూ.1,84,000 రుణం పొందాడు. సతీష్‌కు అదేరోజు రూ.84 వేలు ఇచ్చి, రూ.లక్ష ఇవ్వకుండా బీసీపీ దేవేందర్ సొంత ఖర్చులకు వాడుకున్నాడు. శనివారం సతీష్ బ్యాంకు వద్దకు వచ్చి తన రూ.లక్ష ఇవ్వాలని బ్యాంకులో నిలదీశాడు. చిన్నకార్పాములకి చెందిన పుష్పావతమ్మ గతంలో బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకుని పూర్తిగా చెల్లించింది. ప్రస్తుతం ఆమెకు రూ.2,10,000 బాకీ ఉన్నట్లు సమాచారం వచ్చింది. బాధిత మహిళ బ్యాంకు వద్దకు వచ్చి అధికారులను నిలదీసింది. మరికొందరు బాధితులు కూడా అడగడంతో ఖాతాదారుల సొమ్ము స్వాహా చేసినట్లు విషయం బయటకు వచ్చింది. బ్యాంకులో రుణాలు చెల్లించిన రైతుల పేరుమీద లోన్ తీసుకుని మాఫీ అయితే వారికి ఇవ్వకుండా, స్వాహా చేస్తున్నట్లు తెలిసింది. ఇలా మోసపోయిన వారు బ్యాంకులో రైతులు, బాధితులు చాలామంది ఉన్నారు. దేవేందర్ ఆన్‌లైన్‌లో గేమ్ ఆడి ఖాతాదారుల సొమ్మును పోగొట్టుకున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్‌ఐ సతీష్‌ను వివరణ కోరగా.. బాధితుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. బ్యాంక్ మేనేజర్ సోమ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇటీవల కొత్తగా బ్యాంక్‌కు వచ్చాను బ్యాంకులో జరుగుతున్న విషయాలు తమ దృష్టికి వచ్చాయి, వాటిని పరిశీలిస్తామని వివరించారు.

జోగుళాంబ సన్నిధిలో విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్లు



విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్లకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శనివారం 5 రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్లు దర్శించుకున్నారు. కర్నూల్ జిల్లాలో జరిగనటువంటి దక్షిణ భారత రాష్ట్రాల విద్యుత్ సమ్మేళనానికి వచ్చి, సమీపంలోని ప్రఖ్యాతిగాంచిన శక్తిపీఠం జోగుళాంబ ఆలయాలన్ని దర్శించుకునేందుకు వచ్చారు. వీరికి దేవస్థానం వారు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు దేవళ్ల కృష్ణమూర్తి శర్మ వీరికి క్షేత్ర ప్రాశస్త్యం తెలియజేసి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కాగా ఇందులో ఏపీ నుంచి ఆచార్య నాగార్జున్ రెడ్డి, తెలంగాణ నుంచి తన్నీరు శ్రీరంగారావు, కర్ణాటక నుంచి రవికుమార్, తమిళనాడు నుంచి చంద్రశేఖరన్ తదితరులు ఉన్నారు.

జూరాల వద్ద 37 గేట్ల ఎత్తివేత

2,70,452 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 2.90లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు 37 క్రస్టు గేట్లను ఎత్తి 2,50,786 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 44, కుడి కాల్వ ద్వారా 731, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 50 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,70,452 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.454 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. ఇప్పటివరకు 74.952 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. శనివారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా చేపట్టామన్నారు. జూరాలకు అత్యధికంగా వరదనీరు చేరుతున్న నేపథ్యంలో దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండడంతో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోతున్నామన్నారు.

సుంకేసులకు భారీగా పెరిగిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం సాయంత్రం ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. శుక్రవారం సాయంత్రం వరకు 1,70,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం సాయంత్రానికి 1,72,000 క్యూసెక్కులకు పెరిగినట్లు బ్యారేజీ అధికారులు తెలిపారు. బ్యారేజీ భద్రత దృష్ట్యా 28 గేట్లు ఎత్తి 1,69,556 క్యూసెక్కులు తుంగభద్రనదిలోకి, కేసీ కెనాల్ గేట్లు ఎత్తి 2,354 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం అవుట్ ఫ్లో 1,71,910 క్యూసెక్కులు కొనసాగుతున్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు వివరించారు.

కొనసాగుతున్న డైట్ విద్యార్థుల కౌన్సెలింగ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ కొనసాగుతుంది. ఈ క్రమంలో శనివారం డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మేరా జుల్లాఖాన్, సూపరింటెండెంట్ సీతారామారావు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించగా.. 340 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు వారు తెలిపారు. సోమవారంతో కౌన్సెలింగ్ ముగుస్తుందని, హాజరయ్యే విద్యార్థులు పూర్తి సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.